ఈనాడు
ఎన్ఆర్ఐ

# డాలస్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



డాలస్, టెక్సాస్: అమెరికాలోని డాలస్‌లో మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఎంజీఎంఎన్‌టీ) ఆధ్వర్యంలో నాలుగో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 300 మందికిపైగా ప్రవాస భారతీయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాన్సుల్ అశోక్ కుమార్, ఇర్వింగ్ సిటీ మేయర్ ప్రోటెం ఆలన్ మీఘర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గాంధీ మెమోరియల్ వద్ద యోగా దినోత్సవం జరుపుకోవడం నాలుగో పర్యాయమని ఎంజీఎంఎన్‌టీ కార్యదర్శి రావు కల్వల తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల సంఖ్యలో అందరూ ఉత్సాహంగా యోగా చేస్తున్నారని, కార్యక్రమానికి సహకరించిన భారత కాన్సులేట్ అధికారులకు, ఇర్వింగ్ సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అనంతరం ఎంజీఎఎన్‌టీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నమ్ మోద్గిల్ కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. 5,000 సంవత్సరాల క్రితం రిశికేష్ యోగాకు జన్మస్థలమైందని, ఐక్యరాజ్యసమితి జూన్ 21న యోగా దినోత్సవంగా ప్రకటించడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 175 దేశాలు యోగా దినోత్సవాన్ని పాటిస్తున్నాయని తెలిపారు. గాంధీ మహాత్ముడు కూడా యోగాకు, ధ్యానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని, ఈ రోజు అదే గాంధీ స్మారక స్థలంలో యోగా దినోత్సవం జరుపుకోవడం సముచితంగా ఉందని అభిప్రాయపడ్డారు. కాన్సుల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా హ్యూస్టన్, మహాత్మా గాంధీ మెమోరియల్ డాలస్ తో కలిపి యోగా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఐక్యరాజ్య సమితి జూన్ 21 యోగా దినోత్సవాన్ని పాటించడం చారిత్రాత్మక విషయమని, నిత్యం అందరూ యోగా అభ్యసించాలని సూచించారు. విశాలమైన థామస్ జెఫెర్సన్ పార్కులో సుందరమైన మహాత్మా గాంధీ మెమోరియల్‌ను ఏర్పాటు చేసిన సభ్యులందరికి ఇర్వింగ్ సిటీ మేయర్ ప్రోటెం ఆలన్ మీఘర్ కృతజ్ఞతలు తెలిపారు. సిటీ పాలకమండలి తరపున ఏ సహాయం చేయడానికైనా ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఎంజీఎంఎన్‌టీ కో- ఛైర్మన్ కమల్ కౌశల్ యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. యోగా శిక్షకుడు విజయ్ బృందం యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు గంటకు పైగా జరిగిన శిక్షణలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే వేదిక పై ప్రతిష్ఠాత్మకమైన 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలలో' ప్రథమ స్థానం సాధించిన కార్తీక్ నెమ్మాని, ద్వితీయ స్థానం పొందిన నైన మోదీ, తృతీయ స్థానంలో వచ్చిన అభిజయ్ కొడాలి, వారి తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన 'జియోస్పెల్ అకాడమీ' నిర్వాహకులు విజయ్ రెడ్డి, గీత మంకులను డా. ప్రసాద్ తోటకూర, ఇతర బోర్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమ విజయానికి సహకరించిన అధికారులకు, వలంటీర్లకు, మీడియా వారికి, బాంబే ఫొటోగ్రఫీ, మ్యూజిక్ మస్తీ, హరియాణా సంఘానికి ఎంజీఎంఎన్‌టీ కోశాధికారి బీఎన్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యోగాలో పాల్గొన్న వారందరికీ యోగ్యతా పత్రాలు, అల్పాహారం అందించారు.


Welcome



